# సీతకు నచ్చిన కథ

మధ్యాహ్నం ఎండ తీక్షణంగా ఉంది. చుట్టువేపుల అంతా నిశ్శబ్దంగా ఉంది. మండువాలో దక్షిణంవైపు గడపమీద తలపెట్టుకు పడుకున్నాను. మగతగా ఉంది. ఇంకా నిద్రపట్టలేదు. బయట తోటలోనుంచి చల్లటిగాలి వీస్తోంది. తోటవేపు వరండాలో సీత కూర్చుని మెల్లగా ఏదో కథ చదువుతోంది. పక్కగదిలోనుంచి మా వదిన కేక వేసింది. "రేపు పరీక్ష పెట్టుకుని ఆ పత్రిక లేమిటే చదవడం! వెళ్ళి పాఠాలు చదువుకో" అని కోప్పడింది. సీత వెటకారంగా అన్నది. "లెక్కల పరీక్షకు కూడా చదువుకుంటారా ఏమిటి!" అని. లెక్కల పరీక్షకు చదవాలో అక్కర్లేదో మా వదినకు కూడా తెలియదు. అయినా ఇంకోసారి గట్టిగా కోప్పడినా లాభంలేదు. సీత చదవదు. కాకపోతే ఏడుస్తుంది. స్కూలు పుస్తకాలు చదివించటం కాని కథల పుస్తకాలు చదవకుండా చెయ్యటంగాని రెండూ దాని దగ్గర కుదరవు. అంచేత మా వదిన ఊరుకుంటుంది.

నాకు కొద్దిగా నిద్రపట్టింది. సీత పుస్తకం విసిరేసింది కాబోలు, నా తలమీద వచ్చిపడింది. నేను ఉలిక్కిపడ్డాను.

సీత విసుక్కుంటోంది. "పో అత్తయ్యా! నీకథ ఏమీ బాగుల్లేదు; ఎప్పుడూ ఏడుపుకథలే" అని. నాకు కొద్దిగా నవ్వు వచ్చింది. ఆ కథ నీకోసం రాయలేదు. నిన్నాకథ చదవమనలేదు. అందామనిపించింది. కాని లాభంలేదు. అది వాదన ప్రారంభిస్తుంది. ఎప్పుడూ అంతే. ఏ కథ చదవద్దన్నా చదువుతుంది. నా కథలు అర్థంకాక, నా తలతిక్క వేదాంతం దాని తలకెక్కక ప్రతిసారి సణుగుతుంది. ఏదైనా మంచికథ రాయమంటుంది. మంచికథ అంటే దాని ఉద్దేశ్యం ఏమిటో నాకూ అంతుపట్టలేదు

అయినా ఇన్ని పత్రికలు, ఇన్ని కథలూ అన్నీ ఈ చిన్నపిల్లలకోసమేనా అనిపిస్తుంది ఒక్కొక్కసారి. పత్రిక ఏదైనారాగానే సీత, దాని తమ్ముడు వేణూ ఆ పుస్తకం కోసం కుస్తీపట్టడమూ ఇద్దరూ చెరొకవేపునా లాగి ఎవరూ చదవకముందే దాన్ని చింపడమూ, ప్రతిరోజు ఇరుగు పొరుగు పిల్లలు పత్రికలకోసం వచ్చి ప్రాధేయపడటమూ. ఏవో కొన్ని చినిగిన కాగితాలుతప్ప అసలు పత్రికరూపంలో ఏదీ మిగిలిలేదని ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోకుండా ఏడుపు ముఖాలతో దిగాలుపడుతూ నించోడమూ, ఇవన్నీ చూస్తే ఇంతమంది కథకులూ ఈ సాహిత్యసేవా అంతా ఈ చిన్నపిల్లలకోసమేనేమో అనిపిస్తుంది.

ఆ వేళ సీతమాట నన్ను ఏదో హెచ్చరించినట్లయింది. దీనికి నచ్చేకథ నేను ఎందుకు రాయలేను అనిపించింది. ఎందుకో ఒక కథ దానికి పూర్తిగా నచ్చేది రాసి

దానిచేత బాగుంది అనిపించాలి అని తోచింది. అయితే దానికెలాంటి కథ నచ్చుతుంది? అది ఊహకందలేదు, రకరకాలుగా ఆలోచనలు కదిలాలు.

ఒక అమ్మాయి, అబ్బాయి సముద్రపు ఒడ్డున కలుసుకుంటారు. సముద్రపు కెరటాల్లో అమ్మాయికాలు జారుతుంది. ఆ అబ్బాయి ఆదుకుంటాడు. ఆ తరువాత ఆ సముద్రపు ఒడ్డునే వాళ్లిద్దరూ ఎన్నోసార్లు కలుసుకుంటారు. స్నేహం ఏర్పడుతుంది. పెళ్ళి చేసుకోవాలనుకుంటారు. అబ్బాయికి డబ్బులేదు. అమ్మాయికి చాలా ఉంది. అంచేత వాళ్ళమ్మ ఈ పెళ్ళికి ఒప్పుకోదు. అమ్మాయిని గదిలోనుంచి బయటికి రానివ్వదు. అబ్బాయి ఎన్నిసార్లు వచ్చినా అమ్మాయికి నిన్ను చూడ్డం ఇష్టంలేదని చెప్తుంది. అబ్బాయి అపార్థం చేసుకుంటాడు. విరక్తితో వెళ్ళి మిలిటరీలో చేరుతాడు. హిమాలయ ప్రాంతాలకు వెళ్ళిపోతాడు. అమ్మాయికి అసలు సంగతి తెలియదు. తనను మోసగించి వెళ్ళిపోయాడని అపార్థం చేసుకుంటుంది. బాధ పడుతుంది. యుద్ధానికి వెళ్ళినా అబ్బాయికి ఏమీ పనిలేకపోతుంది. చైనావాళ్లు వెనక్కి వెళ్ళిపోతారు. ముందుకురారు. అబ్బాయి సెలవుపెట్టి ఇంటికి వస్తాడు. అమ్మాయి స్నేహితురాలు బజార్లో తటస్థపడుతుంది. అమ్మాయి పరిస్థితి. జరిగిన విషయం చెబుతుంది. అబ్బాయి నొచ్చుకుని అమ్మాయిని చూడడానికి వెళతాడు. కాని ఈ సారి నిజంగానే అమ్మాయి అతనిని చూడటానికి ఇష్టపడదు.

అలకతో మూతి బిగించుకొంటుంది. అబ్బాయి ఖిన్నుడై వెళ్ళిపోతాడు. అమ్మాయి దూరపు బంధువు ఒకడు డబ్బు కోసం అమ్మాయిమీద కన్నువేసి ఉంటాడు. ఎల్లాగో తల్లిని మంచిచేసుకొని పెళ్ళికి ఏర్పాటు చేసుకుంటాడు. అబ్బాయిమీది కసితో అమ్మాయి పెళ్ళికి ఒప్పుకుంటుంది. కాని ప్రమాదమేమీ జరగదు, మళ్ళా చెలికత్తె సహాయ పడుతుంది. అపార్థాలన్నీ మంచు తెరల్లాగ విడిపోతాయి. సమయానికి అబ్బాయి వచ్చి ఆదుకుంటాడు. కథ సుఖాంత మవుతుంది.

ఈ కథ సీతకు నచ్చుతుందా! దీన్ని సాగదీసి సాగదీసి చిలవలు పలవలు కల్పించి నేను రాయలేనా! ఏమో! చివర వివాహఘట్టంమాత్రం చాల విపులంగా వివరంగా రాయాలి. లేకపోతే మళ్లా సీతకు నచ్చదు.

ఆ మధ్య ఒక స్నేహితురాలితో సినిమాకు వెళ్లాను. మామూలు సినిమాయే! ఒకటి రెండు యుగళ గీతాలు పాడింతరువాత నాయకీ నాయకు లిద్దరూ విడిపోతారు. తరువాత కథంతా ఎత్తుకు పై ఎత్తులతో, అపార్థాలతో, విషాద గీతాలతో సాగుతూ ఉంటుంది. చివరిసీనులో అనేక కత్తి యుద్ధాలు, ముష్టియుద్ధాలు చేసి అలసిపోయి శత్రువుల నందరిని ఓడించి నాయకుడు వీరాధి వీరుడుగా ఏకాకిగా నిలబడి ఉన్న సమయంలో, అంతవరకు శత్రుమధ్యంలో చిక్కుకుని నలిగిపోతూన్న నాయిక తెరచాటునుంచి మెల్లగా తొంగి

చూస్తుంది. నాయకుణ్ణి చూసి చిరునవ్వు నవ్వుతుంది. నాయకుడూ నవ్వుతాడు. అంతటితో సినిమా అయిపోతుంది.

ఈ ఆఖరుసీనుమాత్రం కాస్త బాగుందనుకున్నాను నేను; సినిమా అయాక ఇంటికి వెళుతున్నాము. త్రోవలో మా స్నేహితురాలు హఠాత్తుగ అన్నది "సినిమా చాలా బాగుంది. కాని ఆఖరుకు నాయికానాయకులు కలుసుకున్నట్లు చూపిస్తే బాగుండేది." అని. నేను ఉలిక్కిపడ్డాను. "ఇంకా కలుసుకోడమేమిటి? కలుసుకున్నారుగా! ఆఖరు సీనులో! నాయిక తెరచాటునుంచి తొంగి చూస్తోంది. మీరు చూడలేదా?" అన్నాను. "చూశానులెండి. ఇంకా బాగా కలుసుకున్నట్లు చూపిస్తే బాగుండేది" అన్నది, ఏదో అసంతృప్తిగా. ఆవిడ ఉద్దేశం వాళ్ళిద్దరికి శాస్త్రోక్తంగా వివాహం జరిపించి ఆ తరువాత ఉద్యానవనంలో విహరిస్తూ కులాసాగా ఉన్నట్లు ఇంకా కొంచంసేపు చూపిస్తే బాగుండేది

అంచేత నేను వ్రాయబోయే కథకుకూడా ముగింపు సుదీర్ఘంగా కొన్ని పేజీలవరకు సంతోషంగా సాగాలి. లేకపోతే నా మేనకోడలికి మళ్లా నచ్చకపోవచ్చు. మగతగా నిద్రవస్తోంది. "రాయైనను కొంతమేలు నారాయణ, మీ మనసుకంటె"-ఎప్పుడో చదివిన పద్యపాదం ఎందుకో మనసులో మెదిలింది. తాను సృష్టించిన పాత్రమీద తనే విసుక్కుంటున్నాడు కవి. అనూయకురాలైన సుగాత్రి భర్తను అంతమాట అనలేదు. మధురమైన ఆ కథ మనసుకు హత్తు

ఖుంది. హఠాత్తుగా ఆలోచన వచ్చింది: ఈ కథ సీతకు బాగుంటుందా? ఈ కథనే నేను కాస్త ఆధునికంగా మార్చి రాస్తే ఎలా ఉంటుంది?

భార్య నవనాగరికురాలు. ఎక్కడ ఏ ఫాషన్ చూస్తే అది అనుకరించడమే అలవాటు. కాలమంతా అలంకరణకే సరిపోతూ ఉంటుంది. అయినా భర్తకు నచ్చదు, అతను కొంచెం మించిన ఫాషన్‌కు భయపడేవాడు, అయినా భార్యకు చెప్పలేదు, ఆమెకు తెలియలేదు. భర్తను మెప్పించాలని ఆమె వేషం ఎక్కువ చేసింది. చూసి భరించలేక భర్త ఇంటికి రావడం మానేశాడు. ఒకరోజు పనిమనిషి రాలేదు. ఇంట్లో పని తప్పలేదు అలంకరించుకోటానికి తీరిక లేదు. అంచేత మామూలుగా సహజంగా ఉంది. భర్తచూసి మెచ్చుకున్నాడు. అప్పుడు చెప్పాడు: చక్కగా మంగళగౌరిలా కళకళ లాడుతూ ఉండాలిగాని వెఱ్ఱివేషాలు వెయ్యకూడదని, కథ సుఖాంతమై కంచికి వెళ్ళింది.

ఇలా రాస్తే సీత మెచ్చుకుంటుందా! ఏమో! ! ఇల్లాంటి కథలే ఈమధ్య చాలా చూశాననిపిస్తోంది. ప్రతి కల్లో వచ్చే ప్రతికథా కంఠతాపెట్టే సీత నేను ఎవరి కథైనా కాపీ కొట్టానంటుందేమో! అది లాభంలేదు.

భారతంలో, భాగవతంలో ఎన్ని మంచి కథలున్నాయి. అల్లాంటివి మళ్లా రాయాలంటే కుదరవా! ఈనాటి జీవితంలో భీముడు, బకాసురుడు ఏకచక్రపురం, కుంతి—ఈకథ బాగుండదా పిల్లలకు? అల్లాంటికథ కల్పిస్తే!

ఏమో! అయినా ఇవ్వాళ వంతులవారిగా ఇంటింటికి వచ్చే ఇబ్బందులేమున్నాయి? ఇంటిపన్ను. నీళ్లపన్ను. చక్కెర కొరత బియ్యంకొరత ఇవేకదా. ఇవి కథావస్తువులుగా ఊహించుకుంటేనే నీరసంగా వుంది.

* * *

ఎప్పుడో కునుకుపట్టింది. పొద్దువాలింది. సీత పిలుస్తోంది, "అత్తయ్యా! లేలే!! నీ కథమళ్లా చదివాను. చాలా బావుంది" అని.

నేను కళ్ళు నులుపుకుంటూ దానికేసి ఆశ్చర్యంగా చూశాను. అది మళ్లా అన్నది "అవును అత్తయ్యా! ఇందాక నీకథక్రింద ఇంకొకకథ తరువాయి ఉంది. నేను రెండూకలిపి చదువుకున్నాను. అర్థంకాలేదు. ఇప్పుడు నీకథ ఎక్కడెక్కడ ఉందో ప్రతికంతా వెతికి వెతికి మళ్ళీ జాగ్రత్తగా చదువుకున్నాను. బావుంది" అని.

నా ముఖం విప్పారింది. ఇన్నాళ్లకు నా కృషి ఫలించింది. ఇంతకూ సీతకు నచ్చిన కథ ఏదో! మూడు కథలు రాశాను ఈమధ్య. ఒకదాంట్లో-తండ్రి కట్నమిచ్చి పెళ్ళి చెయ్యలేడని ఆడపిల్ల అవివాహితగా బ్రతకలేదని అనుకుని ఒక అమ్మాయి ఆత్మహత్య చేసుకుంటుంది. ఈకథ చాలా కరుణ రసంగా ఉంది. రాస్తూ ఉంటే నాకూడా ఏడుపు

వచ్చింది. చదివినవాళ్ళూ ఏడ్చిఉంటారు,—ఇంకో కథలో ఇంజినీరుగా రమ్మాయి తన్ను ప్రేమించడంలేదని తెలిసి పాపం ఒక విద్యార్థి జీవితం చాలిస్తాడు? ఇదీ కరుణ రసాత్మకంగానే ఉంది.—మూడవకథలో ఒక ఆదర్శవాది, లోకంలో అంతా అన్యాయం, అధర్మంగా ఉందని ఏం చెయ్యలేక విషం తాగుతాడు..

ఇందులో ఏది సీతకు నచ్చిందో! ఏదో ఒకటి! పోనీ! అసలు హత్యో ఆత్మహత్యో లేకపోతే కథ రాణించదు.